క్లుప్తంగా

విద్యుత్ వైర్లపై టార్పాలిన్



విద్యుత్ వైర్లపై పడిన టార్పాలిన్

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామ శివారులో 220కేవీ విద్యుత్ లైన్‌పై టార్పాలిన్ పడడంతో స్థానికులు భయాందోళన చెందారు. మంగళవారం రాత్రి ఈదురుగాలులతో చేనులో గల టార్పాలిన్ కొట్టుకుపోయి విద్యుత్ తీగలపై పడింది. అధిక వోల్టేజీ ఉండటంతో అటుగా వెళ్లిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించగా, సిబ్బంది చేరుకుని టార్పాలిన్ తొలగించారు.

‘తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు’

తలమడుగు: ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్టులను ఫార్మ ఆఫీసర్స్‌గా నియమిస్తూ జీవో 71 విడుదల చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలంగాణ ఫార్మ అసోసియేషన్ ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

బోథ్: మద్యం సేవించి వాహనాలు నడపొద్దని ఎస్సై ఎల్. ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కుచులాపూర్ శివారులో గల వేంకటేశ్వర ఆలయం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల పత్రాలు పరిశీలించారు. పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని సూచించారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు



పట్టుబడ్డ మద్యం, నిందితుడితో అధికారులు

భీంపూర్: అక్రమ మద్యం తరలిస్తున్న మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన మేస్రం కొండును ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ బుధవారం అరెస్ట్ చేశారు. మహారాష్ట్ర నుంచి దేశీదారు సీసాలను తీసుకొస్తుండగా అర్లి(టీ)లో పట్టుకున్నట్లు తెలిపారు. ఆయన వద్ద నుంచి రూ.10 వేల విలువ గల 280 దేశీదారు మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది తానాజీ, నానంగ్ సింగ్, వెంకటగిరి, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో లక్ష్మీపూర్ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

జైనథ్: రాష్ట్రస్థాయి వేసవి సైన్స్ శిబిరంలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సైన్స్ ల్యాబ్ డ్రీమ్ ఫోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లాలో 12 రోజుల పాటు వేసవి శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు యోగిత, బంగారి కృష్ణవేణిలు సైన్స్ విభాగంలో ప్రతిభ కనబర్చారు. ఇందుకు గాను ప్రశంసా పత్రాలతో ఒక విజేత ఆత్మ కథ పుస్తకాన్ని బహుమతిగా అందుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోరెడ్డి అశోక్ విద్యార్థులను అభినందించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బోథ్: మండల కేంద్రానికి చెందిన బోనగిరి రమేశ్‌కు ఇటీవల ప్రమాదం జరిగి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. అనంతరం పొచ్చెర గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగయ్య తండ్రి ఇటీవల మృతి చెందడంతో పరామర్శించారు. మాజీ సర్పంచ్ సురేందర్, రైతు సంఘం అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

వేతనాలు విడుదల చేయాలి

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ మెడికల్, హెల్త్ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాష్ బొంకంటి ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో 3వరోజు నిరసన తెలిపారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముగిసిన విద్యుత్ భద్రతా వారోత్సవాలు

- వారంపాటు కార్యక్రమాలు
- విద్యుత్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: వేసవి కాలం వచ్చిందంటే చాలు ఏదో ఒక చోట విద్యుత్ షాక్‌కు గురై మనుషులు, పశువులు మృత్యువాత పడుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈక్రమంలో విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు వినియోగదారులకు ఏటా మే 1 నుంచి 7 వరకు వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యుత్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యుత్ సప్లయ్ నిలిచినప్పుడు పునరుద్ధరణ కోసం ఎవరిని సంప్రదించాలో అవగాహన కార్యక్రమంలో వినియోగదారులకు వివరించారు.

వారం పాటు కొనసాగింపు..

ఆదిలాబాద్‌రూరల్ మండలంలో సుమారు 17వేలకుపైగా విద్యుత్ కనెక్షన్‌లు ఉండగా మావల మండలంలో 18వేలకు పైగా విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఆయా ప్రాంతాలలోని వినియోగదారులకు విద్యుత్ వినియోగించే సమయంలో గృహాలకు, వ్యవసాయ బావుల వద్ద నాణ్యమైన పరికరాలు వాడడం, విద్యుత్తు స్తంభాలు ఎక్కడం వంటివి చేయరాదని, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఫ్యూజులు వాడడం చేయరాదని, తదితర వాటిపై అవగాహన కల్పించారు.

ముగిసిన వారోత్సవాలు

విద్యుత్ భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆదిలాబాద్‌రూరల్, మావల మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ వినియోగించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా మండలాల ఏఈ వోలు అవగాహన కల్పించారు. ఈ నెల 1న ప్రారంభమైన విద్యుత్ భద్రతా వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వారం రోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలతో కొంత మేరకు వినియోగదారులకు ఉపయోగపడిందని పలువురు వినియోగదారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది వేసవి కాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగలేదని ఆయా మండలాల అధికారులు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. దీంతో షాక్ తగిలినా ప్రాణాపాయం ఉండదన్నారు. విద్యుత్ షాక్‌తో సర్కిల్ పరిధిలో ఏటా కోట్ల రూపాయల పరిహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, ప్రైవేట్ వ్యక్తులు ముట్టుకోవద్దని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

అవగాహన కల్పించాం..



విద్యుత్ వల్ల జరిగే ప్రమాదాల నివారణ కోసం ఏటా మే మొదటి తారీఖు నుంచి 7 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అందులో భాగంగానే మండలంలో పలు ప్రాంతాల్లో వీటిని నిర్వహించాం. విద్యుత్ అసౌకర్యానికి అంతరాయం కలిగితే వారి పరిధిలోని విద్యుత్ అధికారులను సంప్రదించాలి. వినియోగదారుడు విద్యుత్ శాఖ వారికి సమాచారం ఇవ్వకుండా ఎలాంటి మరమ్మతులు చేపట్టవద్దు. అవసరమైతే టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలి. – జనార్దన్ రెడ్డి, ఏఈ, మావల

కష్టపడ్డ వారికి పార్టీలో గుర్తింపేది?

- పరిశీలకుల ఎదుట కార్యకర్తల ఆవేదన
- కాంగ్రెస్ సమావేశంలో గందరగోళ పరిస్థితి



ఇచ్చోడ: మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి తాహెర్‌బిన్ హందాన్

కైలాస్‌నగర్: పదేళ్లు అధికారంలో లేకున్నా పార్టీ జెండా మోశామని, పార్టీ పటిష్టత కోసం ఎంతో కష్టపడ్డా పార్టీలో తగిన గుర్తింపు దక్కడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గ్రామ, బ్లాక్, పట్టణ, మండల, జిల్లా అధ్యక్ష పదవుల భర్తీ కోసం బుధవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. టీపీసీసీ పరిశీలకులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, మాజీ ఎంపీ ఎస్.వేణుగోపాల చారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పదవుల నియమాక ప్రక్రియ దరఖాస్తు విధానంపై వారు ప్రసంగించారు. పలువురు కార్యకర్తలు లేచి పార్టీనే నమ్ముకుని ఏళ్లుగా పనిచేస్తున్న తమకు తగిన గుర్తింపు దక్కడం లేదన్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలోనూ అన్యాయం చేస్తున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యతనిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో మిగతా కార్యకర్తలంతా పోడియం వద్దకు దూసుకెళ్లడంతో గందరగోళ పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలో పార్టీ పరిశీలకులు లేచి వెళ్లిపోవడంతో కార్యకర్తలు తీవ్రనిరాశ వ్యక్తం చేశారు. అనంతరం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి, నాయకులు భూపెల్లి శ్రీధర్, సాయి చరణ్ గౌడ్, సామ రూపేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఇచ్చోడ: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం కలిసికట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అభినందన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బోథ్ నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలు, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. త్వరలో పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులను నియమించనున్నట్లు తెలిపారు. పార్టీలో గ్రూపు విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలన్నారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీలు సోయం బాపురావు, వేణుగోపాలచారి, డీసీసీబీ అధ్యక్షుడు అడ్డిబోజారెడ్డి, బోథ్, ఆదిలాబాద్ ఇన్‌చార్జిలు, ఆడే గజేందర్, కంది శ్రీనివాస్‌రెడ్డి, బజార్‌హత్నూర్, తలమడుగు మాజీ జెడ్పీటీసీలు మల్లెపూల నర్సయ్య, గోక గణేశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరేశ్‌జాదవ్, జిల్లా అధికారప్రతినిధి పసుల చంటి పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం



కల్యాణం జరుపుతున్న పండితులు

జైనథ్: భోరజ్ మండలంలోని గూడ గ్రామంలో రెండో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మూడు రోజుల నుంచి శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పద్మావతి అలివేలిమంగ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా జరిపారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మొదట గణపతి పూజతో మొదలుకొని పూర్ణాహుతి కార్యక్రమాలతో పాటు యజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా గ్రామస్తుల సహకారంతో పట్టు వస్త్రాలను చేతపట్టుకొని మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా కల్యాణ మహోత్సవం కొనసాగింది. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నేరడిగొండ: పంట సాగులో రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించాలని శాస్త్రవేత్తలు, ఏఆర్ఎస్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామప్రసాద్, శాస్త్రవేత్త డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఏఓ కృష్ణవేణిలు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులకు అధిక మొత్తంలో పురుగుల మందులు వాడడంతో పంటలకు నష్టం వాటిల్లుతుందని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని తెలిపారు. పంట మార్పిడితో కలిగే లాభాలపై అన్నదాతలకు వివరించారు. తెగుళ్లు, రబీ, ఖరీఫ్ కాలంలో వేసే పంటలు, మిశ్రమ పంటల సాగు, నేల ఆరోగ్యం, కొత్త పంటల వివరాలు, వాతావరణ మార్పులు తట్టుకునే వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బురద జల్లడం మానుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: జిల్లాలో పత్తి కొనుగోళ్ల అక్రమాల్లో ఎమ్మెల్యే సహకారం ఉందని మాజీమంత్రి జోగు రామన్న బురద జల్లడం మానుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లాలోని కొన్ని జిన్నింగ్ మిల్లులలో జరిగిన అక్రమ కొనుగోళ్ల విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రికి తానే ఫిర్యాదు చేశానన్నారు. అవగాహన రాహిత్యంతో మాజీ మంత్రి అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన మంత్రిగా ఉన్న హయాంలో కలప, హరితహారం, బీసీ కార్పొరేషన్‌లో జరిగిన అవినీతిపై మీడియాలో సైతం కథనాలు వచ్చాయన్నారు. తనకు సంబంధం లేని వ్యవహారాల్లో ఆరోపణలు చేస్తే న్యాయపోరాటానికి సైతం వెనుకాడబోనన్నారు. నాయకులు ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, రఘుపతి, జోగు రవి, దినేశ్ మటోలియా, రాజేశ్, శ్రీనివాస్, వేద వ్యాస్, ముకుంద, సూర్య, నగేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ రద్దు చేయాలని నిరసన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న బీజేపీ నాయకులు

నార్నూర్: ఇందిరమ్మ ఇళ్ల కమిటీని రద్దు చేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాథోడ్ బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చాల్కుర్ ప్రకాశ్‌లు మాట్లాడుతూ కమిటీ సభ్యులు నిబంధనలు పాటించకుండా కుటుంబ సభ్యుల పేర్లను ప్రతిపాదించుకోవడం సమంజసం కాదన్నారు. పదేళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన వారిని, కారు, ఇళ్లు ఉన్నవారిని ఎంపిక చేశారని ఆరోపించారు. కనీసం గ్రామసభ కూడా నిర్వహించకుండా లబ్ధిదారుల ఎంపిక ఎలా చేస్తారని ప్రశ్నించారు. వెంటనే కమిటీ రద్దుచేసి నిజమైన అర్హత ఉన్నవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలన్నారు. కాగా నిరసన కారణంగా రోడ్డుకిరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సీఐ రహీంపాషా సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులను బలవంతంగా పోలీసులు తరలించడంతో కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. కార్యక్రమంలో నాయకులు బబన్, మహేందర్, ఇందిరమ్మ లబ్ధిదారులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న గంగాధర్

నార్నూర్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ గంగాధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, ఇందిరమ్మ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ గంగాసింగ్, ఎంపీవో సాయిప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి రాథోడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్, పేసా చట్టం కోఆర్డినేటర్ రాథోడ్ సికిందర్ తదితరులు ఉన్నారు.

నోటిఫికేషన్ విడుదల

నార్నూర్: తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ, నార్నూర్‌లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ప్రశాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు మే 20 వరకు అందుబాటులో ఉంటాయన్నారు. సీట్ల కేటాయింపు పదో తరగతి పరీక్షలలో మెరిట్, రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ఆధారంగా ఉంటుందన్నారు.

హమాలీల సంఖ్య పెంచాలి

బోథ్: బోథ్ మార్కెట్ పరిధిలో హమాలీల సంఖ్య పెంచాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో జొన్నపంటను పరిశీలించి, రైతులతో కలిసి మాట్లాడారు. యార్డులో కాంటాలను పెంచి, హమాలీలను పెంచితే పంట కొనుగోళ్లు త్వరగా జరుగుతాయని, దీనివల్ల రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురిసే అవకాశమున్నందున మార్కెట్ కమిటీ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు చొరవ చూపాలన్నారు. రైతులు రామకృష్ణ, గంగయ్య, రమేశ్, గంగాధర్, స్వాములు ఉన్నారు.

తెల్లకల్లు దుకాణం యజమానిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని తిర్పెల్లి తెల్లకల్లు దుకాణం యజమాని స్వామిగౌడ్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. తెల్లకల్లు బాటిల్‌లో డ్రగ్స్ కలిపి విక్రయిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. బాటిల్‌లోని తెల్లకల్లును పరీక్షలు చేయగా, మత్తు పదార్థాలు కలిపినట్లు నిర్ధారణ అయిందని తెలిపారు. దుకాణాన్ని సీజ్ చేసి ఆయనపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీ నూతన కమిటీ ఎన్నిక

భీంపూర్: మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపెల్లి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అంకం అశోక్, ప్రధాన కార్యదర్శులుగా నారాయణ, వెంకటేశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా స్వామి, గిరిజన మోర్చా అధ్యక్షుడిగా సోమేశ్వర్, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా సన్నిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా గజానన్, సోషల్ మీడియా కన్వీనర్‌గా అక్షయ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా సంజీవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎన్‌హెచ్ఏఐ వారితో పోలీసులు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం జాతీయ రహదారిపై వీటిని ఏర్పాటు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. భారీ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలుపరాదని, పార్కింగ్ స్థలంలోనే వాహనాలను నిలుపాలని సూచించారు.

టూల్ కిట్ల పంపిణీ

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డోగ్రా క్రాఫ్ట్ (ఇత్తడి బొమ్మల తయారీ దారులు) కళాకారులకు కావాల్సిన యంత్రాలను, టూల్‌కిట్లను బుధవారం ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అందజేశారు.

ఉట్నూర్‌కు బీసీ మేల్కొలుపు యాత్ర

ఉట్నూర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 42శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని బీసీ ఆజాది ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ మేల్కొలుపు రథయాత్ర బుధవారం రాత్రి ఉట్నూర్ చేరుకుంది.

సమాజసేవలో నిమగ్నమవ్వాలి

ఉట్నూర్‌రూరల్: సమాజ హితం కోసం నిరంతరం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం కన్నాపూర్ గ్రామంలో ఆర్వీజీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

ఘనంగా వాసవీ కన్యకపరమేశ్వరి జన్మదినం

ఇచ్చోడ: మండల కేంద్రంలో హనుమాన్‌సాయి ఆలయంలో బుధవారం మాత వాసవీ కన్యకపరమేశ్వరి జన్మదిన వేడుకలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యక పరమేశ్వరి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

‘రైతుల ఖాతాల్లో పంట డబ్బులు’

కైలాస్‌నగర్: రైతులు పండించిన పంటలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేయడంతో పాటు డబ్బులను సైతం వారి ఖాతాల్లో జమ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు చెబుతున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 62వేల క్వింటాళ్ల కందులను కొనుగోలు చేయగా, అందుకు సంబంధించిన రూ.46 కోట్లను విడుదల చేశారన్నారు. ప్రస్తుతం 57వేల క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేయగా, రూ.32 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు.

ఐటీఐలో బోధించేందుకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తాత్కాలిక పద్ధతిన బోధించేందుకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డర్ కోర్సులో బోధించేందుకు బీటెక్ మెకానికల్, డిప్లమా మెకానికల్ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. బయోడేటాతో గురువారం సాయంత్రం 5 గంటల్లోగా పోస్టు ద్వారా లేదా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు డీలర్ల సమావేశం

బోథ్: బోథ్, సొనాల మండలాలకు చెందిన విత్తన, పురుగుల మందుల డీలర్లకు గురువారం బోథ్ మండల కేంద్రంలోని రైతువేదికలో జిల్లా వ్యవసాయ అధికారి, టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు సమావేశం నిర్వహించనున్నట్లు బోథ్ మండల వ్యవసాయాధికారి రవితేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు డీలర్లు హాజరు కావాలన్నారు. కాగా పట్నాపూర్ గ్రామంలోని రైతు వేదికలో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం’ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బోథ్‌లో సంబరాలు

బోథ్: పాక్ ఆక్రమిత్ కశ్మీర్‌లో బుధవారం తెల్లవారు జామున భారత జవానులు ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిన ఘటనలో ఉగ్రవాదులు మృతిచెందడంతో బోథ్‌లో బుధవారం సాయంత్రం సంబరాలు నిర్వహించారు. బస్టాండ్ వద్ద టపాసులు పేల్చారు. స్వీట్లు పంచిపెట్టారు. జై భారత్, జై హింద్ అంటూ నినాదాలు చేశారు.

వేసవి శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: విద్యార్థులు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇచ్చోడ జెడ్పీ పాఠశాల పీడీ రామేశ్వర్ విద్యార్థులను కోరారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో విద్యార్థులతో మాట్లాడారు. వేసవి క్రీడా శిక్షణలో హ్యాండ్ బాల్, కరాటే, సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రతీరోజు ఉదయం శిబిరానికి వచ్చి క్రీడా శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగుల తీరు.. ప్రజల తిప్పలు



కార్యాలయంలో తాళం వేసిన దృశ్యం



సాయంత్రం 4 గంటలు దాటినా ఖాళీగానే కుర్చీ

విధి నిర్వహణలో విద్యుత్ శాఖ ఉద్యోగుల తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయంలో అందుబాటులో ఉండాల్సిన ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బుధవారం ‘సాక్షి’ విద్యుత్ శాఖ కార్యాలయాన్ని సందర్శించగా ఏ ఒక్క విభాగంలోనూ ఉద్యోగులు అందుబాటులో లేకపోగా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఉన్నతాధికారి ఉదయం సమావేశం నిర్వహించగా మధ్యాహ్నం విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు గైర్హాజరయ్యారు. ఉద్యోగుల తీరుతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. – ఆదిలాబాద్‌టౌన్

రోహింగ్యాలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

భీంపూర్: ఆదిలాబాద్ జిల్లాలో నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్ రోహింగ్యాలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల డిప్యూటీ తహసీల్దార్ హరిదాస్‌ను మండల బీజేపీ నాయకులు కోరారు. మండల కేంద్రంలోని ఆయన కార్యాలయంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్, నారాయణ, వెంకటేశ్, స్వామి, గజానన్, సోమేశ్వర్, సన్నిత్ రెడ్డి, అరుణ్, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.